క్లుప్తంగా

కోస్గి బంద్‌ను విజయవంతం చేయండి

కోస్గి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండను నిరసిస్తూ మంగళవారం పలు సంఘాల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న కోస్గి పట్టణ బంద్‌ను అన్ని వర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని పలు సంఘాల నాయకులు సూచించారు. బంద్‌లో భాగంగా ఉదయం 10 గంటలకు రామాలయం చౌరస్తా నుంచి శివాజీ చౌరస్తా నిరసన ర్యాలీ చేపడుతున్నామని, అధిక సంఖ్యలో హాజరై బంద్‌ను విజయవంతం చేయాలన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



మరికల్: మండలంలోని కన్మనూర్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఆయుష్ వైద్యాధికారి చంద్రశేఖర్, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేష్‌నాయక్ రోగులకు చికిత్స చేసి ఉచితంగా ఆయుర్వేద మందులను అందజేశారు. 64 మందికి వివిధ రకాల చికిత్స చేశామని వారు తెలిపారు. వైద్య చికిత్సల అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేందర్, రుక్మిణిదేవి, శ్వేత, కార్యదర్శి రమేష్, స్పెషల్ ఆఫీసర్ మురళీగౌడ్, సుజాత, విజయలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ అమలు చేయాలి



మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన రైతు రుణమాఫీ హామీని ఆంక్షలు లేకుండా అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మద్దూరు ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ నవీన్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. రుణమాఫీకి 2018–23 డిసెంబర్ 9 కటాఫ్ తేదీని ఎత్తివేయాలని, ఒక రేషన్‌కార్డుకు ఒక కుటుంబ అనే నిబంధనను ఎత్తివేసి రుణమాఫీ అమలు చేయాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ మూడో విడత రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొండన్న, కొండా నర్సిములు, ఊశప్ప, హాజీ, మొగులప్ప, సాయప్ప, కిష్టప్ప పాల్గొన్నారు.

ఊట్కూరు తహసీల్దార్‌గా రవి



ఊట్కూరు: స్థానిక తహసీల్దార్‌గా రవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కోస్గిలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఊట్కూరుకు వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కళ్యాణి బదిలీపై కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. కాంగ్రెస్ నాయకులు నూతన తహసీల్దార్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, జమీర్‌అలీ, బీమాకవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లను కేటాయించాలని వినతి

దామరగిద్ద: మండలంలోని మల్‌రెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరని, ప్రత్యామ్నాయంగా విద్యా వలంటీర్లను కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు సోమవారం డీఈఓ అబ్దుల్‌ఘనీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 210 మంది విద్యార్థులున్నా.. సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధన సరిగా లేదని వాపోయారు. దీనిపై డీఈఓ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ శివకుమార్, బాల్‌రాజ్, సాయిలు, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

అలుగు పారుతున్న గురువలింగంపల్లి చెరువు



మాగనూర్: వారం రోజులుగా కురిసిన ఎడతెరిపి లేని వానల కారణంగా మండలంలోని గురువలింగంపల్లి గ్రామ చెరువు అలుగు పారుతోంది. వర్షాకాలం ప్రారంభంలోనే చెరువులు, కుంటలు నిండి అలుగులు పారడంతో చాలా సంతోషంగా ఉందని రైతులు అంటున్నారు. వీటితో పాటు చెరువులు, కాల్వల మరమ్మతులపై అధికారులు దృష్టి సారించి, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

హర్ ఘర్ తిరంగా యాత్ర

మరికల్: మండల బీజేవైఎం ఆధ్వర్యంలో మరికల్‌లో సోమవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ యాత్ర రాయిచూర్ రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి గ్రామంలో ప్రధాన వీధుల గుండా జాతీయ రహదారిపైకి చేరుకుంది. అనంతరం చౌరస్తాలో భారత మాతకు జై అంటూ నినాదాలు చేశారు. ఈ తిరంగ యాత్రకు మండలంలోని అధిక సంఖ్యలో బీజేపీ, బీజేవైఎం నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో నర్సన్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, నరేష్‌గౌడ్, విజయ్‌కుమార్‌రెడ్డి, రాజేష్, వేణు, తిరుపతిరెడ్డి, మోహన్‌రెడ్డి, మల్లేష్, శ్రీరామ్, రమేష్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



మరికల్‌లో హర్ ఘూర్ తిరంగ యాత్రలో పాల్గొన్న నాయకులు

విద్యార్థులకు దేశభక్తి పాటల పోటీలు..

నారాయణపేట రూరల్: సంస్కార భారతి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ గ్రౌండ్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు దేశభక్తి పాటలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలకు చెందిన చిన్నారులు పాల్గొనగా.. ప్రథమ బహుమతి అబ్దుల్ రియాజ్ (లిటిల్ స్టార్స్), ద్వితీయ బహుమతి కృష్ణచైతన్య (పీహెచ్ఈఎస్), తృతీయ బహుమతి విష్ణు (కృష్ణవేణి) పాఠశాలలకు చెందిన వారు గెలుపొందారు. న్యాయ నిర్ణేతలు సంగ నర్సింహులు, ఎద్కే శ్రీకాంత్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రమశిక్షణ, తల్లిదండ్రులు, గురువులపై గౌరవం, దేశంపై భక్తి భావం పెంపొందించేందుకు టీచర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకట్రాములు, చంద్రకాంత్, రఘువీర్, సాయికృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కోటకొండ జెడ్పీ స్కూల్‌లో అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను బాలురు, బాలికలకు వేర్వేరుగా సోమవారం నిర్వహించారు. విజేతలకు జెండావిష్కరణ అనంతరం బహుమతులు అందించనున్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం సునీత, పీఈటీ రమణ పాల్గొన్నారు.



కోటకొండలో..



నారాయణపేటలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కోస్గి: పట్టణంలోని తిమ్మన బావి శివాంజనేయ స్వామి, భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి ఆలయం, ఇంద్రనీలేశ్వర ఆలయాల్లో ప్రతిఏటా నిర్వహించే శ్రావణ మాస పూజల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లికార్జునస్వామి ఆలయంలో గొంగ్లే నటరాజ్, సంధ్య దంపతులు అర్చకులు విశ్వనాథ్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. తిమ్మనబావి ఆలయంలో పురోహితులు రుద్రాక్షాల మఠం అమర లింగ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

నేడు మద్దూరు పట్టణ బంద్

మద్దూరు: బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ వారికి మద్దతుగా మంగళవారం హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఐక్యవేదిక నాయకులు సాయిలు, భరత్, కాశీ తదితరులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పాతబస్టాండ్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బంద్‌కు పాఠశాల యాజమాన్యాలు, వ్యాపారులు, అందరూ సహకరించాలని కోరారు.

హిందువులపై దాడి నిరసిస్తు ర్యాలీ

మరికల్: బంగ్లాదేశ్‌లో చెలరేగిన అల్లర్ల కారణంగా హిందూ ఆలయాలు, హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసిస్తూ సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలు అయిన హిందువులపై దాడి హేయమైన చర్య అని ఖండించారు.

రాజీవ్‌గాంధీ కృషితో సాంకేతిక విప్లవం



సద్భావన జ్యోతియాత్రకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

కృష్ణా: రాష్ట్ర సరిహద్దులోని కృష్ణా బ్రిడ్జిపై సోమవారం రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతిని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అందుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ద్విచక్రవాహన ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ మృతి చెంది 30ఏళ్లు పూర్తయినా ఆయనను దేశం ఇప్పటికీ మరువలేదన్నారు. ప్రధానిగా ఆయన చేసిన సేవలు, సాంకేతిక విప్లవం అంతర్జాతీయ స్థాయిలో దేశానికి గుర్తింపునిచ్చాయన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, బోయ రవికుమార్, గణేష్, రాజప్పగౌడ, పల్లె సురేష్, క్రిష్ణమూర్తి, నారాయణ, నాగేందర్, రాకేష్, అంజప్పగౌడ్ పాల్గొన్నారు.

మాగనూర్: రాజీవ్‌గాంధీ సద్భావన జ్యోతి యాత్ర ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో మాగనూర్ మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో సమావేశం నిర్వహించారు.

ఊట్కూరు: రాజీవ్‌గాంధీ సద్భావన జ్యోతియాత్రకు సోమవారం కాంగ్రెస్ నాయకులు ఊట్కూరు చెక్‌పోస్ట్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం కృష్ణ టైరోడ్ నుంచి ప్రారంభమైన సద్భావన యాత్ర మధ్యాహ్నం ఊట్కూరు చెక్‌పోస్టుకు చేరుకోగా.. కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డికి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, దుర్గం శ్రీనివాస్, ఎల్కోటి నారాయణరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, నాసిర్‌ఖాన్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కర్ణాటక కాంగ్రెస్ నాయకుల నుంచి జ్యోతిని అందుకుంటున్న ఎమ్మెల్యే శ్రీహరి

బాలకృష్ణగౌడ్‌కు సర్వాయి పాపన్నగౌడ్ సేవా పురస్కారం



ధన్వాడ: మండల కేంద్రానికి చెందిన రంగస్థల నటుడు మొల్కమొళ్ల బాలకృష్ణగౌడ్ సోమవారం సర్వాయి పాపన్న గౌడ్ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లో జైగౌడ సేన జాతీయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల సందర్భంగా బాలకృష్ణగౌడ్ ఏకపాత్రాభినయంతో పాపన్నగౌడ్ యొక్క శౌర్య పరాక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా గౌడ సేన జాతీయ కమిటీ అధ్యక్షుడు మోర్ల ఏడుకొండలు, జబర్దస్తు ఫేం అదిరే అభిగౌడ్ అవార్డును అందజేసినట్లు ఆయన తెలిపారు. సేవా పురస్కారం లభించడంపై ధన్వాడ గౌడ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రెగ్యులర్ డాక్టర్లను నియమించాలి



డాక్టర్ కీర్తికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రెగ్యులర్ డాక్టర్లను నియమించాలని ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ జిల్లా కార్యదర్శి ప్రతాప్ అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిని పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ డాక్టర్లు లేక ప్రజలు, రోగులు ఇబ్బందులు పడుతున్నారని, పారిశుద్ధ్య పనులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఇన్‌చార్జ్ డాక్టర్‌తో ఆస్పత్రిని నెట్టుకురావడం సరైందికాదన్నారు. అనంతరం రోగులకు మెరుగైన సేవలు అందించాలని డాక్టర్లకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సౌజన్య, ఈశ్వర్, సలీం, లక్ష్మి, సునీత, తిరుమలేష్, శ్రీకాంత్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నారాయణపేట: ఎమ్మెల్యే డాక్టర్ పర్ణికరెడ్డిని నారాయణపేట జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇప్పటి వరకు రాష్ట్ర శాసనసభ సమావేశంలో వ్యాయామ విద్య, స్పోర్ట్స్‌కు ఉన్నటువంటి ప్రాముఖ్యతపై ఎవరూ మాట్లాడలేదని, తమ ఎమ్మెల్యే మాట్లాడం చాలా గర్వంగా ఉందని వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ఆనందం వ్యక్త పరిచారు. కార్యక్రమంలో పీఈటీలు నరసింహులు, రత్నయ్య, అనంతసేన, వెంకటప్ప, రామకృష్ణారెడ్డి, పర్వీన్‌బేగం, రాధిక తదితరులు పాల్గొన్నారు.

జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలి

దామరగిద్ద: జీఓ 317 ద్వారా చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి కోరారు. సోమవారం సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తపస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ సమక్షంలో మండలంలోని కంసాన్‌పల్లి, వత్తుగుండ్ల, క్యాతన్‌పల్లి, నర్సాపూర్, మొగుల్‌మడ్క, విఠలాపూర్, కాన్‌కుర్తి పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు నర్సప్ప, తిరుపతయ్య, కనకప్ప, అమరేష్, బసిరెడ్డి, భీమప్ప, శశిధర్, శశిపాల్, నరేష్ పాల్గొన్నారు.



'మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మారుద్దాం'



నారాయణపేట రూరల్: ఎన్నో కుటుంబాలను నాశనం చేస్తున్న డ్రగ్స్ భూతాన్ని కూకటివేళ్లతో కదిలించి, మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చుకుందామని ఏఎంఓ విద్యాసాగర్ అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో సోమవారం కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఉదయం ప్రార్థనలో నిషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా ఏఎంఓ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను వివరించడంతో పాటు గతంలో దాని బారిన పడిన కుటుంబాల పరిస్థితిని తెలియచేశారు.

సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

దామరగిద్ద: భారీ వర్షాల కారణం కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లాలో సంభవించిన వరదల దాటికి నిరాశ్రయులైన బాధితులకు సాయం అందించి అండగా నిలుద్దామని సీపీఎం మండల కార్యదర్శి గోపాల్ అన్నారు. కేరళ వరద బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో రూ.7,380 విరాళాలు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జోషి, శివకుమార్, రామకృష్ణ, మోహన్, అశోక్ పాల్గొన్నారు.



విద్రోహ శక్తులను కఠినంగా శిక్షించాలి

మక్తల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు చేసిన విద్రోహ శక్తులను కఠినంగా శిక్షించాలని మక్తల్‌లో హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో మక్తల్‌లో సోమవారం నల్లజానమ్మ ఆలయం నుంచి మక్తల్‌లో వివేకానంద చౌరస్తా వరకు భారీగా శాంతియుతంగా విద్యార్థులు, నాయకులు, వివిధ ధార్మిక సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో అన్ని మతాల వారికి సమ ప్రాధాన్యత ఉందని, బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై దాడులు సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి శంకరోళ్ల రవికుమార్, న్యాయవాది అడెం శ్రీనివాసులు, బీజేవైఎం మంజునాథ్, రాజుగౌడ్, రాంమాదవ్, నీలవర్ధన్‌రెడ్డి, నర్సింహ, పూల శ్రీను, కృష్ణమూర్తి, వంశీవినయ్, బీమేష్, కర్నిస్వామి, విజయ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న హిందూ ధార్మిక సంఘాలు

ఎర్ర సత్యం సేవలు మరువలేనివి



మరికల్‌లో ఎర్ర సత్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దూరు: మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం 29వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం మద్దూరులోని అతిథి గృహం ఆవరణలో ముదిరాజ్ సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జాతికి, బడుగు, బలహీన వర్గాలకు చేసినా మేలును గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు గోపాల్, రాములు, రవికుమార్, నారాయణ, చందు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: దివంగత మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో సోమవారం ముదిరాజులు, నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. అలాగే ఆయన స్వగ్రామంలో కూడా వర్ధంతిని నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో సూర్యమోహన్, నారాయణ, హరీష్, బసంత్, కృష్ణయ్య, రాజు, జగదీశ్, నర్సిములు, గోపాల్, రవి, కొండయ్య, శేఖర్‌లు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం చిత్రపటానికి అఖిలపక్షం ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిములునాయుడు, శ్రీనివాసులు, చిన్నబాల్ నరసింహులు, రామచంద్రయ్య, నారాయణ, లక్ష్మయ్యగౌడ్, శివకుమార్, బాల్‌చందర్, శాంతికుమార్, బాలరాజ్, రాములు, హుసేనప్ప, వెంకటేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర సత్యం సేవలు చిరస్మరణీయం

దామరగిద్ద: ముదిరాజ్ సమాజానికి మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం అందించిన సేవలు చిరస్మరణీయమని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కావలి మొగులప్ప అన్నారు. మండల కేంద్రంలోని భవానీ ఆలయ సమీపంలో ఎర్ర సత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హన్మంతు, మాజీ సర్పంచ్ సుభాష్, నీలి వెంకట్రాములు, చంద్రకాంత్, మొగులప్ప, ఆర్ వెంకటప్ప తదితులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మాగనూర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండల వనరుల కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆగస్టు 13, మంగళవారం మండల కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కోకన్వీనర్ అంజనేయులు అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. 7 నుంచి 9 నెలలుగా మెస్, గుడ్ల బిల్లుల పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు గొల్లనరేష్, లక్ష్మీదేవి, స్వర్ణలత, నర్మదా, ప్రమీల, గౌసియా తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీసే..

నారాయణపేట రూరల్: సమాజంలో ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీసులుగా వ్యవహరించాలని ఏఎస్ఐ బాలయ్య అన్నారు. మండలంలోని కొల్లంపల్లిలో సోమవారం సురక్షపోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో శాంతిభద్రతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రకటనలు పెట్టడం నేరమని, వాహనదారులు తప్పనిసరి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తిమ్మారెడ్డి, కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కళ్యాణి, రుక్యానాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్ఐ బాలయ్య

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

నారాయణపేట రూరల్: విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని షీటీమ్ కానిస్టేబుల్ బాలరాజు హెచ్చరించారు. పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్‌లో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అత్యవసర సమయంలో రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయం తెలుసుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళలు, విద్యాలయాల్లో బాలికలతో ఎవరైనా ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్ లైన్ నెంబర్ 87126 70398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలియచేశారు. తల్లిదండ్రులు అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని కోరారు. నిత్యం యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయాలన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు.



పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నారాయణపేట రూరల్: పట్టణంలోని మార్కెట్‌లేన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో బుచ్చన్న, వేణుగోపాల్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

డీఈఓపై ఫిర్యాదు



నారాయణపేట రూరల్: జిల్లా విద్యాశాఖ అధికారి ఎండీ అబ్దుల్‌ఘనీపై సోమవారం డీటీఎఫ్, టీపీటీఎఫ్, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణ శివారులోని బీవండికాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఏఏపీసీ ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ హెచ్‌ఎం ఫర్విన్‌ఖానుతో పాటు టీచర్ జ్యోతిపై కూడా సస్పెన్షన్ వేటు వేయడం సరికాదన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల సర్వీస్ పుస్తకాలను తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. జ్యోతి అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూర్యచంద్ర, రెడ్డప్ప, వేణుగోపాల్, జ్యోతి పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు నర్వ వాసులు

నర్వ: దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను తిలకించేందుకు నర్వ మండలం నుంచి ఇద్దరికి అవకాశం కల్పించినట్లు నీతి అయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కోఆర్డినేటర్ బాలాజీ తెలిపారు. కేంద్రప్రభుత్వం ద్వారా చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలో నీతి అయోగ్ సంస్థ నర్వ మండలాన్ని ఎంపిక చేసిన విషయం తెలిసిందే. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను తిలకించేందుకు అవకాశం కల్పించిన కలెక్టర్ సిక్తాపట్నాయక్, నర్వ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపికైన రాఘవేందర్‌గౌడ్, వెంకట్రాములుగౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

విక్రమ్‌సారాబాయికి ఘన నివాళి

నారాయణపేట రూరల్: అంతరిక్ష పితామహుడు విక్రం సారాబాయి జయంతిని పురస్కరించుకొని సోమవారం మండలంలోని జాజాపూర్ జెడ్పీ పాఠశాలలో డీఎస్ఓ భానుప్రకాష్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం భారతి, టీచర్లు మధుసూదన్, నర్సింహ, మంగళ, శశిరేఖ, నిర్మల, శిరీష, శ్రీదేవి పాల్గొన్నారు.